ఆక్రమణలో ఫుట్‌పాత్‌లు

- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న వ్యాపారులు
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు

సీతమ్మధార : స్మార్ట్‌సిటీగా అభివృద్ధి చెందుతున్న విశాఖ మహానగరంలో జీవీఎంసీ కోట్లాది రూపాయల వ్యయంతో అభివృద్ధి చేసిన ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురయ్యాయి. పాదచారులు నడిచే వీలు లేకుండా చిన్న, పెద్ద వ్యాపారులు ఇష్టారాజ్యంగా ఆక్రమించేసి వ్యాపారాలు చేసుకుంటున్నా చర్యలు తీసుకునే నాథుడే కరువయ్యాడు. తప్పనిసరి పరిస్థితుల్లో పాదచారులు రహదారుల పైనే నడవాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు సాగిస్తూ రోడ్లను సైతం లావాదేవీల కోసం ఆక్రమించేస్తున్నా జీవీఎంసీ జోన్ – 3 టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది కనీస చర్యలు తీసుకోవడం లేదు. ఆక్రమణల ఫలితంగా సీతమ్మధారలోని అనేక రహదారుల్లో ట్రాఫిక్ సమస్యలు సైతం రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. అలాగే ఆక్సిజన్ టవర్స్, చర్చి, తదితర ప్రాంతాల్లోని గెడ్డలను కూడా ఆక్రమించి బడ్డీలు ఏర్పాటు చేయడంతో వర్షాల సమయంలో వరద నీరు ముందుకు సాగక రోడ్లు జలమయమవుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

అంతా వ్యాపారుల ఇష్టారాజ్యం

సీతమ్మధారలోని అనేక రహదారులను ఆనుకుని వీధి, వాణిజ్య వ్యాపారులు కార్యకలాపాలు సాగిస్తున్నారు. వారి స్వలాభం కోసం ఫుట్‌పాత్‌లను, రహదారులను ఇష్టారీతిగా ఆక్రమించేస్తున్నారు. ద్విచక్ర వాహనాల పార్కింగ్, బోర్డు ఏర్పాటు, నిర్మాణ సామగ్రి, జనరేటర్ల ఏర్పాటు, టిఫిన్ సెంటర్ల సామగ్రి, కూరగాయలు, పండ్లు విక్రయాలు చేస్తున్నారు. అనేక కూడళ్లలో వీధి వ్యాపారులు రోడ్లను, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్నారు. జీవీఎంసీ 24, 14వ వార్డుల పరిధిలో గల నక్కవానిపాలెం, గాంధీనగర్, బాలయ్య శాస్త్రి లే అవుట్, నార్త్ ఎక్స్‌టెన్సన్, తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న గురుద్వారాకు వెళ్లే రోడ్డులో, ఆక్సిజన్ టవర్స్ పక్క రోడ్డు, ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ వెనుక రోడ్డు, ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రి పక్క రోడ్డు తదితర ప్రాంతాల్లో రహదారులను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. గాంధీనగర్, నక్కవానిపాలెం, గురుద్వారా వెళ్లే మార్గంలో అయితే పాదచారులు ఫుట్‌పాత్‌లపై కాదు కదా రోడ్లపై నడిచే పరిస్థితి కూడా లేకుండా వ్యాపారాలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పరిస్థితిని చక్కదిద్దాలని, ఫుట్‌పాత్‌లను, రహదారులను ఇష్టారాజ్యంగా వినియోగించుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.


ఆక్సిజన్ టవర్స్ సమీపంలో గెడ్డ మీద నిర్మించిన కల్వర్టును ఆక్రమించి నిర్వహిస్తున్న వ్యాపారాలు

ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి



సీతమ్మధారలోని ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు వెంటనే తొలిగించాలి. పాదచారులు ఫుట్‌పాత్‌లపై నడిచేందుకు వీలు లేకుండా చాలా మంది వ్యాపారాలు సాగిస్తున్నారు. వారిపై జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

– కె.నాగిరెడ్డి, నక్కవానిపాలెం

స్పెషల్ డ్రైవ్‌తో కఠిన చర్యలు



జోన్ పరిధిలో ఫుట్‌పాత్‌ల ఆక్రమణల మీద ఫిర్యాదులు వస్తున్నాయి. స్పెషల్ డ్రైవ్ ద్వారా కఠిన చర్యలు తీసుకుంటాం. అవసరమైతే పోలీసు శాఖ సహకారం కూడా తీసుకుంటాం. ఫుట్‌పాత్‌ల మీద పాదచారులు నడిచేలా చర్యలు చేపడతాం.

– కె.శివప్రసాద్, జెడ్సీ, జోన్


సత్యం జంక్షన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం రోడ్డులో ఫుట్‌పాత్‌పై నిర్వహిస్తున్న వ్యాపారాలు


ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రి పక్క రోడ్డులో ఏర్పాటు చేసిన బడ్డీలు


ఆక్సిజన్ టవర్స్ పక్క రోడ్డులో ఆక్రమణ ఏర్పాటు చేసిన బడ్డీలు

క్లుప్తంగా

లలితాపీఠంలో సంకటహర చతుర్థి


లలితాపీఠంలో పూజలందుకున్న గణపతి

సీతంపేట : సంకటహర చతుర్థి సందర్భంగా స్థానిక లలితాపీఠంలో శనివారం సాయంత్రం వినాయకునికి ప్రత్యేక పూజలు, లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. గణనాథునికి అత్యంత ప్రీతిపాత్రమైన తిథులలో చతుర్థి ఒకటని, కష్టాల నుంచి గట్టెక్కించే సంకట హర చతుర్థి వ్రతం ఎంతో విశిష్టమైనదని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణ సేన్ తెలిపారు. అనంతరం పీఠం దర్బారు హాల్లో శాస్త్రోక్తంగా గణపతి హోమం నిర్వహించారు. గణపతి హోమం వల్ల కార్యసిద్ధి, ఆరోగ్యం, విజయం లభిస్తాయని అర్చకులు తెలిపారు. సీతంపేట కూడలిలో దుర్గా గణపతి ఆలయం, శంకరమఠం రోడ్‌లో విజయ గణపతి ఆలయంలో సంకట హర చతుర్థి పూజలు నిర్వహించారు.

ప్రేమ పేరుతో వంచించిన వ్యక్తిపై కేసు

పీఎం పాలెం: ప్రేమ పేరుతో యువతిని లొంగదీసుకుని పెళ్లికి నిరాకరించిన వ్యక్తిపై పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం నగరంలో తాటిచెట్లపాలెంకు చెందిన యువతిని భీమిలికి చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి 2017వ సంవత్సరం నుంచి ప్రేమిస్తూ లైంగిక దాడికి పాల్పడుతున్నాడు. పెళ్లి చేసుకోవాల్సిందిగా ఆమె కోరడంతో అందుకు నిరాకరించాడు. దీంతో మోసపోయాయని గ్రహించిన ఆమె శనివారం పీఎంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

రైతుబజారు స్టాళ్లకు డ్రా


రైతుకు టోకెన్ అందిస్తున్న ఈవో కొండబాబు

సీతమ్మధార : సీతమ్మధార రైతుబజారులో శనివారం 65 స్టాళ్లకు డ్రా తీశారు. ఉదయం వ్యాపారం చేసే రైతులు 87 మంది, సాయంత్రం వ్యాపారం చేసే రైతులు 57 మంది ఉండగా... స్టాళ్లకు రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు డ్రా తీసి రైతులకు టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెటింగ్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు ప్రతీ వారం స్టాళ్లకు డ్రా తీసి రైతులకు కేటాయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార : జీవీఎంసీ పరిధి 14వ వార్డు బాలయ్యశాస్త్రి లే అవుట్ దరి రాధాకృష్ణ లే అవుట్‌లో జీవీఎంసీ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు శనివారం శంకుస్థాపన చేశారు. రూ.19.50 లక్షలతో సీసీ కాలువలు, రిటైనింగ్ వాల్ నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నియోజకవర్గాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు అభివృద్ధి పనులు వేగవంతం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో 14వ వార్డు కార్పొరేటర్ కటారి అనిల్‌కుమార్ రాజు, బీజేపీ ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జి సురేష్‌బాబు, టీడీపీ ప్రధాన కార్యదర్శి మహ్మద్‌నజీర్, ధర్మారావు, జోన్ – 3 కమిషనర్ కె.శివప్రసాద్, డీఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గురజాడ అడుగుజాడల్లో నడుద్దాం


మురళీనగర్ వాకర్స్ పార్కులో గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్ : అభ్యుదయ ప్రజా కవి గురజాడ ప్రవచించిన సామాజిక సేవా దృక్పథాన్ని అలవరుచుకుని ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు కార్యదర్శి రాళ్లపల్లి సత్యనాథం పిలుపునిచ్చారు. మురళీనగర్ వాకర్స్ క్లబ్ కార్యదర్శి పి.సెల్వరాజు అధ్యక్షతన మురళీనగర్ వాకర్స్ పార్కులో గురజాడ అప్పారావు, తెన్నేటి విశ్వనాథం జయంతిని శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ముందుగా గురజాడ, తెన్నేటి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురజాడ అప్పారావు తెలుగు భాషకు చేసిన సేవలను వివరించారు. స్వాతంత్ర్య సమరయోధుడు తెన్నేటి విశ్వనాథం నేటి తరానికి ఆదర్శనీయుడని పేర్కొన్నారు. క్లబ్ ఉపాధ్యక్షుడు ఏవీ సుబ్బారావు, కార్యదర్శి సీహెచ్.ప్రసాదరావు, జాలీ వాకర్ ప్రకాశరావు, కార్యవర్గ సభ్యులు ఎస్.రామమోహన్, టీవీ రమణ, పి.ప్రసాద్, సూర్యనారాయణ మాస్టారు, జి.విజయలక్ష్మి, ఆర్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా గణనాథుని అనుపోత్సవం


ఊరేగింపులో భారీ వినాయకుడు

మద్రిపాలెం : వినాయక చవితి మహోత్సవాలను పురస్కరించుకుని 51వ వార్డు మాధవధార సీతన్న గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి భారీ విగ్రహాన్ని శనివారం రాత్రి నిమజ్జనం చేశారు. ఈ మేరకు ప్రిన్స్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పట్టాభిషేక గణపతిని పరిసర వీధుల్లో వైభవంగా ఊరేగించారు. పెద్ద ఎత్తున డప్పులు, నృత్యాలు, కేరింతలతో వినాయకుడిని సాగనంపారు. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు గాంధీ నగర్ సత్యం జంక్షన్ వద్ద నిర్వహిస్తున్న శ్రీ వరసిద్ధి వినాయక పూజా మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. కోన గోవిందరావు ఆధ్వర్యంలో ఉదయం నుంచి పూజలు చేసి సాయంత్రం గణపతి అనుపోత్సవం ఘనంగా నిర్వహించారు. యువకులు ఉత్సాహంగా నృత్యం చేశారు. ద్వారకా సీఐ డి.వెంకటరమణ నేతృత్వంలో ఏఎస్‌ఐ డి.వి.రత్నం, సిబ్బంది రక్షణ చర్యలు చేపట్టారు.


అనుపోత్సవంలో శ్రీ వరసిద్ధి గణపతి

అన్నా క్యాంటీన్లు ప్రారంభం


అన్న క్యాంటీన్‌లో టిఫిన్ వడ్డిస్తున్న ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు


క్యాంటీన్‌లోకి వెళ్లకుండా స్థానికులను అడ్డుకుంటున్న పోలీసులు

మద్రిపాలెం : జీవీఎంసీ 53వ వార్డు ఆర్ అండ్ బీ జంక్షన్ సర్వీస్ రోడ్డు వద్ద అన్నా క్యాంటీన్‌ను ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు కలిసి శనివారం ప్రారంభించారు. క్యాంటీన్ ప్రారంభిస్తారని తెలుసుకున్న స్థానికులు 12 గంటలకే అక్కడికి చేరుకున్నారు. అయితే అంతకు ముందు అన్నా క్యాంటీన్ ఆవరణలో ఉన్న మార్గంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అన్నా క్యాంటీన్‌ను ఒంటి గంటకు ప్రారంభించారు.

స్థానికులను అడ్డుకోవడంతో గందరగోళం

మరోవైపు సభ జరుగుతుందని స్థానికులను క్యాంటీన్ లోపలికి అనుమతించకుండా పోలీసులు అడ్డుకోవడంతో కొంతసేపు వాగ్వాదం జరిగింది. క్యాంటీన్ బయట సుమారు గంట సేపు ప్రజలు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. కొద్దిసేపటి తర్వాత అందరూ ఒక్కసారిగా లోపలికి దూసుకు పోవడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది.

నేత్ర వైద్యశాల ఆవరణలో...

సీతంపేట : స్థానిక బుల్లయ్య కళాశాల రోడ్‌లో ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 24, 25, 27వ వార్డు ప్రజలకు ఈ క్యాంటీన్ అందుబాటులో ఉంటుందని, రూ.5లకే ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం లభిస్తుందన్నారు. కార్మికులు, చిరు వ్యాపారులకు అన్న క్యాంటీన్ ఎంతో ప్రయోజనకరమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు గండి బాబ్జీ, జనసేన నార్త్ ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్, కార్పొరేటర్లు సారిపిల్లి గోవింద్, గొలగాని వీరారావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి

మహారాణిపేట : విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని, సీనియర్లు జూనియర్లతో స్నేహపూర్వకంగా మెలగాలని ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. బుచ్చిరాజు అన్నారు. శనివారం ఏఎంసీ సెంటినరీ ఎగ్జామ్ హాల్లో యాంటీ ర్యాగింగ్ అవేర్‌నెస్ ప్రొగ్రాం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ బుచ్చిరాజు మాట్లాడుతూ క్యాంపస్‌ను ర్యాగింగ్ ఫ్రీగా తీర్చిదిద్దుకోవాలని కోరారు. సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి వెంకట శేషమ్మ ర్యాగింగ్ వల్ల కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు వివరించారు. ఆంధ్రప్రదేశ్ ర్యాగింగ్ నిషేధ చట్టం, 1997 దాని సవరణల ముఖ్య లక్షణాలను వివరించారు. యాంటీ ర్యాగింగ్ సెల్ నోడల్ అధికారి డాక్టర్ ఎ. కృష్ణవేణి, ఏఎంసీ కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌వోడీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైద్య విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంస్కరించేది సంస్కృతం


మహిళలకు సంస్కృత భాష పుస్తకాలు అందజేస్తున్న సత్యదేవ్

కంచరపాలెం : సంస్కృత భాష సనాతనమైనదని, సంస్కరించేదని, వేద, పురాణాలు, ఉపనిషత్తులు, భగవద్గీత సంస్కృత భాషలోనే రచించారని ది వరల్డ్ టీచర్ ట్రస్ట్ (జగద్గురు పీఠం) డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ పేర్కొన్నారు. తాటిచెట్లపాలెంలో గల మాస్టర్ ఇ.కె.సంస్కృతి సదన్‌లో 20 రోజుల పాటు సంస్కృత భారతి ఆధ్వర్యంలో మహిళలకు సంస్కృత ప్రవేశ శిక్షణ తరగతులు నిర్వహించారు. శనివారం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వృత్తి విద్యలో శిక్షణ పొందుతున్న మహిళలు సంస్కృత భాష పట్ల చూపిస్తున్న శ్రద్ధాభక్తులు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ బి.ఉషారాణి, దాట్ల రాధ, ఉపాధ్యాయులు సంధ్యారాణి, పసుమర్తి తుషిత తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం


మొక్క నాటుతున్న లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ దేముడు, ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ

మురళీనగర్ : నివాస ప్రాంతాల్లోని పరిసరాల్లో పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ బి.దేముడు పిలుపునిచ్చారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గ్రైస్)లో వాల్తేరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ పర్యవేక్షణలో శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ ప్రాంతాల్లోని ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ వెంకటరమణ మాట్లాడుతూ తమ కాలేజీని పర్యావరణహితంగా మార్చేందుకు విద్యార్థుల తల్లిదండ్రుల పేరుతో మొక్కలు నాటుతున్నామని చెప్పారు. అంతేకాకుండా కాలేజీని సందర్శించిన ప్రతీ అధికారి చేతుల మీదుగా మొక్కలు నాటించి వారి పేరు మీద పెంచుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా కాలేజీలో 40 మొక్కలు ఆనటారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ వీఎస్‌ఆర్‌కే ప్రసాద్, ప్రొఫెసర్ ఎస్.రామకృష్ణారావు, చీపురుపల్లి సత్యారావు, కాలేజీ డిపార్టుమెంట్ హెడ్‌లు డాక్టర్ బీవీ లక్ష్మణరావు, డాక్టర్ ప్రశాంతకుమారి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొండవాలులో పడకేసిన పారిశుధ్యం


రాంజీ ఎస్టేట్ పాఠశాల మార్గంలో పేరుకుపోయిన చెత్త

కంచరపాలెం : జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం కొండవాలు ప్రాంతంలో పారిశుధ్యం అధ్వానంగా తయారైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాంజీ ఎస్టేట్ ప్రాథమిక పాఠశాలకు ఆనుకుని ఉన్న అరుంధతినగర్, కప్పరాడ, అంబేడ్కర్‌నగర్, బాపూజీనగర్, సంజీవయ్యకాలనీ, జైప్రకాశ్‌నగర్, అల్లూరిసీతారామరాజు నగర్ రహదారిలో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. పరిసర వీధుల్లో సేకరించిన చెత్తను సిబ్బంది ఇక్కడే డంప్ చేస్తున్నారు. ఇక్కడ పుష్‌కార్ట్స్, డంపర్ బిన్లు తుప్పు పట్టడంతో చెత్తను తరలించడం లేదు. చెత్త పేరుకుపోవడంతో పశువుల సంచారం ఎక్కువగా ఉందని, సమీప పాఠశాలల విద్యార్థులు, పాదచారులు ముక్కుమూసుకుని వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. స్థానిక వార్డు కార్పొరేటర్, సచివాలయ శానిటరీ కార్యదర్శులు, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ జాడ కనిపించడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత జోన్ – 5 పబ్లిక్ హెల్త్ అధికారులు స్పందించి చెత్త తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

రైతుబజార్లకు సెలవు పునరుద్ధరించాలని లేఖ

సీతమ్మధార : విశాఖ ఉత్తర నియోజకవర్గంలో గల మూడు రైతుబజార్లకు గతంలో కొనసాగిన వారంలో ఒక రోజు సెలవు పునరుద్ధరించాలని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు కోరారు. ఈ మేరకు ఆయన జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌కి రాసిన లేఖ ప్రతులను శనివారం మీడియాకి విడుదల చేశారు. కంచరపాలెం, నరసింహనగర్, సీతమ్మధార రైతుబజార్లకు గతంలో ఉన్న వారాంతపు సెలవును కొందరు రైతుల వినతి మేరకు రద్దు చేయాలని కోరానని గుర్తు చేశారు. కానీ రైతుబజార్లలో నిర్వహించిన సర్వేలో మెజారిటీ రైతులు సెలవు కోరుకుంటున్నందున మళ్లీ ఈ బజార్లకు సెలవును పునరుద్ధరించాలని ఆయన తన లేఖలో జేసీని కోరారు. కంచరపాలెం బజార్‌లో 103 మంది సెలవు కావాలని, 11మంది వద్దు అని సర్వేలో తెలిపారన్నారు. నరసింహనగర్ బజారులో 123 మంది రైతులు సెలవు కావాలని, ఒక్క రైతు మాత్రమే వద్దు అని కోరారని తెలిపారు. సీతమ్మధార రైతుబజార్‌లో 203 మంది రైతులు సెలవు కావాలని, 10 మంది మాత్రమే వద్దు అని కోరారని స్పష్టం చేశారు. మెజారిటీ రైతులు సెలవు కోరుతున్నందున ఈ మూడు బజార్లకు సెలవు పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని జేసీని ఎమ్మెల్యే కోరారు.

వాడవాడలా అన్నసమారాధన


సీతంపేట దుర్గా గణపతి ఆలయం వద్ద అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు


అన్నదానంలో వడ్డన చేస్తున్న పోతు సత్యనారాయణ

సీతంపేట : దుర్గా గణపతి నవరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం సీతంపేట కూడలిలో ఉత్సవ కమిటీ మహా అన్న సమారాధన నిర్వహించింది. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అన్న ప్రసాదం స్వీకరించారు. బీజేపీ నాయకురాలు శ్యామల దీపిక, ఉత్సవ కమిటీ చైర్మన్, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ అన్న సమారాధన ప్రారంభించారు. ముందుగా దుర్గా గణపతికి ప్రత్యేక పూజలు చేసి, హారతులిచ్చారు. సుమారు 8 వేల మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రమాభాయి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సీతంపేట : జీవీఎంసీ 26వ వార్డు రామకృష్ణానగర్‌లో రామకృష్ణానగర్ యూత్ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా శనివారం మహా అన్నదానం నిర్వహించారు. సుమారు నాలుగు వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు పోతు సత్యనారాయణ భక్తులకు వడ్డన చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కొత్తూరు శ్రీనివాస్, బ్యాగుల శ్రీను, అప్పలరాజు, నాగరాజు, ప్రదీప్, గురునాథ్ పాల్గొన్నారు.

శివపదం.. భావితరాలకు మార్గదర్శకం


కార్యక్రమంలో బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ, ఎం.ఎస్.ఎన్.రాజు, డాక్టర్ రాంబాబు తదితరులు

మద్దిలపాలెం: శివపదాలు అంతరంగ భావాలకు ప్రతిబింబాలుగా, ఆధ్యాత్మిక చైతన్య ప్రబోధాలుగా, భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ ప్రబోధించారు. శివపదం సంకీర్తన యజ్ఞం చివరి రోజు శనివారం శివ నామస్మరణతో మార్మోగింది. కార్యక్రమాన్ని షణ్ముఖశర్మ, వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.ఎన్.రాజు, డాక్టర్ రాంబాబు, కందాళ వెంకట సత్యశ్యామ్, అరుణ గాయత్రి, వి.వి.ఆదినారాయణమూర్తి, టి.రవిరాజు, పైడా కృష్ణప్రసాద్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం బ్రహ్మశ్రీ షణ్ముఖ శర్మ ప్రవచిస్తూ శివ నామస్మరణ మానవీయ ప్రబంధానికి ఎంతో దోహదపడుతుందన్నారు. శివపదాల భావాన్ని అర్థం చేసుకుని అవగతం చేసుకుంటే జీవనం ఆధ్యాత్మికతతో నిండిపోతుందని చెప్పారు. సంగీతం, సాహిత్య పరంగా తాను రచించిన శివపదాలను ప్రముఖ సంగీత విద్వాంసులు స్వరపరచి, తమ మధురగానం, చక్కని శాస్త్రీయ నృత్య కళారీతులతో ప్రదర్శిస్తూ ఖండాంతరాలకు చాటిచెప్పే ప్రయత్నం చేయడం అభినందనీయమన్నారు. శివపదాలు విశ్వవ్యాప్తం చేస్తున్న కళాకారులు, కళాభిమానులకు పరమశివుడి ఆశీస్సులు లభిస్తాయన్నారు. శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల కౌశిక్ కల్యాణ్ తమ శిష్య బృందం తెన్నేటి, ఓలేటి సోదరీమణులు, దేవులపల్లి గోపీకిషోర్ బృందాలు గానామృతంతో సభికులను మంత్రముగ్ధులను చేశారు. విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ,వి శాఖ రుషిపీఠం సత్సంగం సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో అకాడమీ మాస్టర్ ఇ.కె.జన కులం మాస్టర్ ఇ.కె. ఆధ్యాత్మిక సేవా కేంద్రం ప్రధాన నిర్వాహకులు శ్రీమాన్ ఎక్కిరాల అనంత కృష్ణ, కో ఆర్డినేటర్ సిహెచ్.శ్రీనివాసరాజు, వ్యాఖ్యాత పేరాల హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.